ఆదరణకు నోచుకోని రాజమల్లేశ్వరస్వామి

- పారుపల్లిలోని రాజమల్లేశ్వరస్వామి ఆలయానికి 12.5 ఎకరాలు
- సుమారు 200 సంవత్సరాల క్రితం బ్రాహ్మణులు నిర్మించినది
- దేవదాయ శాఖ ఆధ్వర్యంలో పూజలు, నైవేద్యాలు
- దాతలు ముందుకొస్తే జీర్ణోద్ధరణకు సిద్ధం అంటున్న దేవదాయ శాఖ అధికారులు
- శిథిలమైన నందీశ్వరుడి విగ్రహం.. పూడిపోయిన బావి



దేవదాయ శాఖ చేపట్టిన మరమ్మతులతో ప్రస్తుత ఆలయం

క్రోసూరు: సుమారు 200 సంవత్సరాల క్రితం నిర్మించిన రాజమల్లేశ్వరస్వామి దేవాలయం దీన స్థితిలో ఉంది. ప్రస్తుతం అన్ని ఆలయాల్లో శివరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించుకుంటున్నప్పటికీ.. గతంలో ఎంతో వైభవోపేతంగా ఉత్సవాలకు నోచుకున్న రాజమల్లేశ్వరస్వామి దేవాలయానికి మాత్రం భక్తుల ఆదరణ కరువైంది. అప్పటి మల్లన్న మహోత్సవాలు నేడు కరువు. దేవదాయ శాఖ ఏర్పాటు చేసిన అర్చకుడు మాత్రం రెండు పూటలా ఆలయానికి వచ్చి పూజలు చేసి వెళ్లిపోవటం జరుగుతుంది.

ఆదాయం అంతంతమాత్రమే

మండలంలోని పారుపల్లి గ్రామం 200 సంవత్సరాల క్రితం (ఒకప్పటి) బ్రాహ్మణుల అగ్రహారం. అప్పటి బ్రాహ్మణులు నిర్మించుకున్న ఆలయమే రాజమల్లేశ్వరస్వామి దేవస్థానం. పారుపల్లి గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో పీసపాడు గ్రామం ఉంటుంది. స్వాతంత్ర్యం అనంతరం దేశంలో వచ్చిన అనేక మార్పుల కారణంగా బ్రాహ్మణులు అగ్రహారాలు వదిలి వెళ్లిపోయారు. ఆలయ దీప ధూప నైవేద్యాల కొరకు అప్పట్లోనే 12.5 ఎకరాలు ఏర్పాటు చేయటం జరిగింది. అదే విధంగా ఆ గ్రామంలోనే అభయాంజనేస్వామి దేవాలయానికి 9 ఎకరాల భూమి ఉంది. దేవదాయ శాఖ ఆ భూములను కౌలుకు ఇచ్చి ఆదాయం సమకూర్చుకుంటుంది. ప్రస్తుతం పారుపల్లి గ్రామంలో దేవాలయాలకు భక్తుల ఆదరణ లేకుండా పోయింది. దగ్గర్లోని ప్రతి గ్రామంలో ఆలయాలు ఉండటంతతో (పీసపాడు, యర్రబాలెం, క్రోసూరు) భక్తులు ఎవరూ ఇక్కడకు రావటం జరగదు. దేవదాయ శాఖకు కౌలు ఆదాయం సమకూరేది కూడా అంతంతమాత్రమే. గత ఏడాది 12.5 ఎకరాలను కేవలం రూ.97 వేలకు పాడుకున్నారు. దాని పైకం కూడా ఏడాది పూర్తి అవుతున్నా దేవదాయ శాఖకు సక్రమంగా వసూలు కావటం లేదని ఆ శాఖ అధికారులు తెలుపుతున్నారు.



తలుపులు లేని రాజమల్లేశ్వర దేవాలయం, ముళ్ల చెట్ల మధ్య ఆలయ ప్రహరీ గోడ (ఫైల్)



శిథిలమైన నందీశ్వరుడి విగ్రహం, పాడైపోయిన బావి

ప్రస్తుత పరిస్థితి ఇలా...

దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయానికి రంగులు వేసి, ప్రహరీ నిర్మించి, గేట్లు పెట్టినప్పటికీ ఆలయంలో నందీశ్వరుడి విగ్రహం శిథిలమైంది. అదే విధంగా పూర్వపు బావి పూర్తిగా పాడైంది. అందులో చెట్లు పెరిగాయి.

మ్యాచింగ్ గ్రాంటుతో జీర్ణోద్ధరణకు సిద్ధం



దేవదాయ శాఖ ఎప్పటి నుంచో భక్తుల నుంచి మ్యాచింగ్ గ్రాంటు కొరకు ఎదురు చూస్తుంది. మ్యాచింగ్ గ్రాంటు ఇచ్చేందుకు భక్తులు ముందుకొస్తే సీజీఎఫ్ నిధులు మంజూరు చేయించి ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేయించేందుకు సిద్ధంగా ఉన్నాను

– రంగిసెట్టి సూరినారాయణ, ఈవో, క్రోసూరు

హైకోర్టు నోటిఫికేషన్ నిలుపుదల చేయాలి

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన జూనియర్ సివిల్ జడ్జి నోటిఫికేషన్ తక్షణమే నిలుపుదల చేయాలని న్యాయవాది, మాదిగ లాయర్స్ ఫెడరేషన్ సభ్యుడు బొక్క సంగీతరావు మంగళవారం అన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమ ఫలితం మందకృష్ణ మాదిగ త్యాగం వలన సుప్రీంకోర్టు వర్గీకరణ అమలు తీర్పు దృష్ట్యా రాష్టంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎస్సీ వర్గీకరణ అమలు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించి, కమిషన్ రిపోర్ట్ రావాల్సి ఉన్న ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలో విడుదల చేసే ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్‌ని ప్రభుత్వం నిలుపుదల చేసిందన్నారు. ఆ విషయం అందరికీ తెలుసునని, అలానే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నోటిఫికేషన్ కూడా నిలుపుదల చేయాలన్నారు. ఈ నోటిఫికేషన్ ఇవ్వడం ద్వారా దళిత జాతి న్యాయవాదులు ముఖ్యంగా మాదిగ కులానికి సంబంధించిన న్యాయవాదులు చాలా నష్టపోతారన్నారు.

మండలంలో 144 సెక్షన్ అమలు

ముప్పాళ్ళ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు తహసీల్దార్ ఎం.భవానిశంకర్ మంగళవారం చెప్పారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించాల్సిందేనని, ఎవరైనా అతిక్రమిస్తే వారిపై కేసులు నమోదు చేయటం జరుగుతుందన్నారు. దుకాణదారులు రెండు రోజుల పాటు దుకాణాలు మూసివేయాలన్నారు.

క్లుప్తంగా

ఆటలమ్మ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

మండల ఆయుర్వేద వైద్యాధికారి శ్రీనివాస్



బెల్లంకొండ: ఆటలమ్మ (చికెన్ పాక్స్) వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల ఆయుర్వేద వైద్యాధికారి ఆర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివిధ గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత కాలంలో వచ్చే ఆటలమ్మ వ్యాధిపై అవగాహన కల్పించారు. వారిసెల్ల జోస్టర్ అనే వైరస్ ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. జ్వరం, దురద, బొబ్బల వంటివి వ్యాధి లక్షణాలుగా ఉంటాయన్నారు. రోగనిరోధక శక్తి పెంపొందించుకోవడం, తాజా కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవడంతో పాటు టీకా ద్వారా వ్యాధిని నివారించవచ్చన్నారు. ఆటలమ్మ వ్యాధిపై గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వనజ, పరిమళ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కృష్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

1 నుంచి లక్ష్మీనారసింహుని దీక్షలు ప్రారంభం

బెల్లంకొండ: స్వయంభూ కేతవరం శ్రీ వజ్ర లక్ష్మీనరసింహస్వామి దీక్షలు మార్చి 1 నుంచి ప్రారంభమవుతాయని మండల దేవదాయ శాఖ ఈవో అవుధూరి వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. వచ్చే నెల ఒకటి, రెండు తేదీల్లో దీక్షలు చేపట్టేందుకు మాలధారులకు అవకాశం ఉందని తెలిపారు. దీక్షలకు సంబంధించి ఆలయ ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ పాశం నరసింహారెడ్డి, ఈమని వెంకటరెడ్డి తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో బోరు ఏర్పాటు



బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ధర్మదీపం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నమో బుద్ధిజం సౌజన్యంతో మంచి నీటి చేతి పంపును మంగళవారం ప్రారంభించారు. నాగార్జున యూనివర్సిటీలో బుద్ధిజం చదువుతున్న విద్యార్థులు ఏర్పాటు చేసిన ధర్మదీపం ఫౌండేషన్ పేరుతో జిల్లా వ్యాప్తంగా 15 మంచి నీటి బోర్లను ఏర్పాటు చేసినట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 సీతారామిరెడ్డి, ఉపాధ్యాయులు డా.కె.నాగేశ్వరరావు, ఎం.సాంబశివరావు, ఎల్.వెంకటేశ్వర్లు, మహిళా కానిస్టేబుల్ రమ్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో సత్తా చాటిన జై భారత్ విద్యార్థిని



క్రోసూరు: సత్తెనపల్లి ఎస్‌బీజీ కళాశాలలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో క్రోసూరు జై భారత్ పాఠశాల విద్యార్థిని విద్యాసిరి సత్తా చాటినట్లు పాఠశాల డైరెక్టర్ జైనేంద్రరెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల 10వ తరగతి విద్యార్థిని గుగ్గిలం విద్యాసిరి టాలెంట్ టెస్ట్‌లో అద్భుతమైన ప్రతిభ చాటి ద్వితీయస్థానం సాధించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థిని కృషి, పట్టుదల, ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఈ విజయానికి కారణమయిందన్నారు. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గ స్థాయిలో ప్రతిభావంతులైన విద్యార్థుల మధ్య తమ విద్యార్థిని ప్రతిభ శ్లాఘనీయమని అన్నారు. ఎస్‌బీజీ విద్యా సంస్థల చైర్మన్ మట్ట సుబ్రహ్మణ్యం ప్రైజ్ మనీ రూ.3000 అందజేశారని తెలిపారు. అదే విధంగా మరొక విద్యార్థిని బొల్లా భవిత కన్సోలేషన్ బహుమతి సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం షేక్ ఖదీర్, డీన్ తిరుపతి స్వామి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యాసిరిని అభినందించారు.

పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించండి

వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి



సత్తెనపల్లి: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27న జరగనున్న తరుణంలో వైఎస్సార్‌సీపీ ఆదేశాల మేరకు పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 27వ తేదీన జరగనున్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు అభ్యర్థిత్వానికి వైఎస్సార్‌సీపీ మద్దతు ఇస్తుందని, వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రతి ఒక్క పట్టభద్రుడు లక్ష్మణ్‌రావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. లక్ష్మణరావు మంచి విద్యావేత్త అని, పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యల కోసం నిత్యం పోరాడుతూ ఉంటారని, ఆయన గెలుపు నిరుద్యోగుల జీవితాలకు వెలుగు నిస్తుందన్నారు. లక్ష్మణరావు గెలుపును బాధ్యతగా తీసుకొని నియోజకవర్గంలోని ప్రతి ఒక్క వైఎస్సార్‌సీపీ నాయకుడు, కార్యకర్త పనిచేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటరుగా నమోదై ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించమని కోరాలని అన్నారు.

కపోతేశ్వరాలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



నకరికల్లు: దక్షిణకాశీగా ప్రసిద్ధికెక్కిన మండలంలోని చేజర్ల గ్రామంలోని గంగా భ్రమరాంబ పార్వతీ సమేత కపోతేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ భువనగిరి కపోతేశ్వరశాస్త్రి, ప్రధాన అర్చకులు కొండకావూరి వెంకట్రామయ్యశర్మల ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజామున సుప్రభాతసేవ, మేలుకొలుపుతో పూజాధికాలు ప్రారంభమయ్యాయి. అయ్యవారిని, అమ్మవారిని పెండ్లికుమారుని, పెండ్లికుమార్తెను చేసే కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపించారు. రాత్రి విఘ్నేశ్వపూజ, పుణ్యాహవచనం, అఖండ స్థాపన, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణ, వాస్తుహోమం, బలిహరణ తదితర కార్యక్రమాలు ఘనంగా జరిపించారు. స్వామి వార్లను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మొక్కులు చెల్లించుకున్నారు.

ముస్తాబయిన శైవక్షేత్రాలు



పెదమక్కెనలోని మల్లికార్జునస్వామి



దుర్గా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయం



విద్యుత్ దీపాలతో అలంకరించిన ఆలయం

సత్తెనపల్లి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. ఆలయాలను రంగులతో తీర్చిదిద్ది విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం మహాశివరాత్రి పర్వదినం నేపథ్యంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవదాయ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని అచ్చంపేటరోడ్‌లోని దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం, గుంటూరు రోడ్‌లోని శ్రీసనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, మండలంలోని పెదమక్కెన గ్రామంలో గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంతో పాటు పలు శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, శివ పార్వతుల కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు. స్వామి వారి దర్శనానికి బుధవారం తెల్లవారుజాము నుంచే వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీల సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అన్న సంతర్పణలు నిర్వహించనున్నారు.

ముస్తాబయిన కాశీవిశ్వేశ్వరాలయం

రాజుపాలెం: మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని బ్రాహ్మణపల్లిలో వేంచేసి ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి(మరకతలింగం) దేవాలయాన్ని మంగళవారం విద్యుత్ దీపాలు, వివిధ రంగులతో ముస్తాబు చేశారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు జరుగుతాయని పూజారి కోసూరి నరసింహ శ్రీనివాస శర్మ మంగళవారం తెలిపారు. సాయంత్రం స్వామి వారి కల్యాణం అత్యంత వైభవంగా జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకించాలని కోరారు. ఉదయం 11 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

చిరు పొట్ట దశలో వరికి ఎరువులే కీలకం



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ అరుణ, రైతులు

నకరికల్లు: చిరు పొట్ట దశలో ఉన్న వరి పంటకు ఎకరాకు 25 నుంచి 30 కేజీల యూరియా 20 కేజీల పొటాష్ ఎరువులను చల్లాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని కుంకలగుంట, జిల్లాపేటతండా గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతు సేవ కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్టర్ ఐడీ నంబర్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందజేసే సంక్షేమ పథకాలకు ఫార్మర్ ఐడీ నంబర్ అవసరమని అన్నారు. రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కు లింక్ చేసిన ఫోన్ నంబర్‌తో రైతు సేవ కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి ఫార్మర్ ఐడీ నంబర్ పొందాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు షేక్ నవాజ్‌షరీఫ్, పీహెచ్‌ఏ పి.సాయివెంకట్, రైతులు పాల్గొన్నారు.

నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): పంటల సాగులో రసాయనిక ఎరువులు, నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని గోళ్లపాడు, కుందురువారిపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ పాల్గొని మొక్కజొన్న సాగులో కత్తెర పురుగు నివారణకు విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. సాగు చేసిన పంటల వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ డేవిడ్‌రాజు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలి

ఏవో వేణుగోపాల్



క్రోసూరు: మండలంలోని ఆవులవారిపాలెం గ్రామంలో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యపై రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమం ఏవో వేణుగోపాల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వెబ్ ల్యాండ్‌లో పొలం కలిగి ఉన్న ప్రతి రైతుకు 'విశిష్ట గుర్తింపు సంఖ్య'ను ఇస్తున్నట్లు చెప్పారు. ఈ సంఖ్య కలిగిన రైతులకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు అనగా పీఎం కిసాన్, పంట రుణాలపై వడ్డీ రాయితీ, క్రాప్ ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, అన్నదాత సుఖీభవ, రాయితీపై యంత్ర పరికరాలు, సూక్ష్మ నీటి సేద్య పరికరాలు తదితర పథకాల లబ్ధి చేకూరుతుందన్నారు. కావున రైతులందరూ గ్రామాలలోని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందవలసిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిరుమల శ్రీను, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మెలకువలు పాటించడం ద్వారా మిర్చికి అధిక ధర

డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నగేష్



పాపాయపాలెంలో మిర్చి రైతులకు సూచనలు చేస్తున్న ఉద్యాన అధికారులు

బెల్లంకొండ: మిర్చి పంట కోత పూర్తయిన తర్వాత ఆరబెట్టడంలో మెలకువలు పాటించడం ద్వారా అధిక ధర పొందవచ్చని డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నగేష్ తెలిపారు. మండలంలోని పాపాయపాలెం గ్రామంలో మంగళవారం మిరప పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కోత అనంతరం మిరపకాయలను శిల్పాలిన్ పట్టాలపై ఆరబెట్టుకోవాలని, తాలుకాయలు ఏరిన తరువాత కాయల్లో తేమ లేకుండా చూసుకోవాలని సూచించారు. అదేవిధంగా రెండవ కోతకు వచ్చిన మిరప పంటలో నల్ల తామర పురుగు నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు. మండల ఉద్యాన శాఖ అధికారి వై.మోహన్ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో టమాటా సాగు చేసిన రైతులు మార్కెటింగ్ శాఖ ద్వారా గిట్టుబాటు ధరకు పంటను అమ్ముకోవాలని తెలిపారు. రైతులకు కిలో రూ.8 నుంచి 10లు గిట్టుబాటు ధర వచ్చే విధంగా ఉద్యాన, మార్కెటింగ్ శాఖలు అనుసంధానంతో రైతుల నుంచి టమాటా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సిబ్బంది ఎం.వంశీ, రజిని, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు 'జ్ఞానజ్యోతి' వరం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ప్రమీల



జ్ఞానజ్యోతి శిక్షణలో తహసీల్దార్ భవాని శంకర్, ఎంఈఓ సీతారామిరెడ్డి

ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ ప్రమీల

సత్తెనపల్లి: అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం ఇస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణ వరమని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్టు సూపర్‌వైజర్ పి.ప్రమీల అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆరు రోజులుగా కొనసాగుతున్న శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ప్రమీల మాట్లాడుతూ జ్ఞానజ్యోతిలో భాగంగా ఇప్పటికే అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండు దశలలో పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ శిక్షణను అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకొని అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేయాలన్నారు. శిక్షణపై అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకొన్న సందేహాలను డీఆర్పీలు నివృత్తి చేశారు. శిక్షణలో డీఆర్పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం

ముప్పాళ్ళ: మండలంలోని ముప్పాళ్ళ, మాదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎఫ్‌ఎల్‌ఎన్ జ్ఞానజ్యోతి 120 డేస్ సర్టిఫికెట్ కోర్సు ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. ముప్పాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ముగింపు శిక్షణకు తహసీల్దార్ ఎం.భవానిశంకర్, ఎంఈఓ–2 సీతారామిరెడ్డిలు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఈసీసీఈ కోసం అంచనాలు, అసెస్‌మెంట్ కార్డులపై అంగన్‌వాడీ కార్యకర్తలచే డెమో చేయించారు. డీఆర్పీలుగా ఎస్.స్వర్ణలత, జి.జయలక్ష్మీ, ఎం.అనంతలక్ష్మీ, వై.యోగానందలు వ్యవహరించారు.

మిరప పంటను పరిశీలించిన రాష్ట్ర పరిశోధకులు



పెదకూరపాడు: ప్రకృతి వ్యవసాయంలో సాగవుతున్న మిరప పంటను పల్నాడు జిల్లా డీపీఎం అమల కుమారి ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ పరిశోధనా బృందం పరిశీలించింది. పెదకూరపాడులోని ప్రకృతి అభ్యుదయ రైతు అవార్డు గ్రహీత దర్శి శేషారావు మిరప పంటను పరిశీలించారు. ప్రకృతి సాగులో మిరపకి, కెమికల్ సాగులో మిరపకి, పాక్షిక వ్యత్యాసాలను బృందం పరిశీలించింది. మిరపలో అంతర పంటలు వాటి వల్ల ఆదాయ వివరాలు, పీఎండీఎస్ వల్ల ప్రయోజనాలు, వాడిన కషాయాలు, ఖర్చు తదితర వివరాలు నమోదు చేశారు. పరిశోధన బృంద సభ్యులు హిమబిందు, లీలావాణి, లాంఫామ్ ప్రధాన శాస్త్రవేత్త వై రాధ, జడ్.బి.ఎన్.ఎఫ్ సిబ్బంది మధుబాబు, అమూల్య, ఉదయలక్ష్మి, మహబూబ్బీ, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు



ప్రదర్శనలను తిలకిస్తున్న జెడ్పీటీసీ విజయప్రతాప్‌రెడ్డి

అచ్చంపేట: నేషనల్ సైన్స్ డే సందర్భంగా స్థానిక బ్లూబెల్స్ హైస్కూలులో విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్ రెడ్డి వేర్వేరుగా హాజరై విద్యార్థుల ప్రదర్శనల పట్ల ఆకర్షితులయ్యారు. 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు తమలో ఉన్న మేధాశక్తిని ప్రదర్శించారు. వాటర్ ప్యూరిఫైయర్ ద్వారా మురుగునీరు ఎలా శుభ్రమవుతుంది, సౌరశక్తిని ఎలా తయారు చేస్తారు, ఉపగ్రహాల ప్రయోజనాలు, బ్లెడ్ గ్రూప్ ఎలా తెలుసుకుంటారు, మానవుని గుండె, మూత్రపిండాలు ఎలా పనిచేస్తాయి అనే విషయాలను విద్యార్థులు ప్రయోగాత్మకంగా చేసి, వివరించడం సందర్శకులను ఆకట్టుకుంది. ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఇదే పాఠశాల ఆవరణలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో 250 మందికి, సిబార్ హాస్పిటల్ గుంటూరు వారిచే 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఆపరేషన్లు చేసేందుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నిర్మలజ్యోతి, హెచ్‌ఎం మేరి శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోటప్పకొండ తిరునాళ్లకు వడ్డవల్లి విద్యుత్ ప్రభలు



విద్యుత్ ప్రభ వద్ద ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి గ్రామంలో ఆంజనేయస్వామి గుడి, పోలేరమ్మ గుడి నుంచి రెండు విద్యుత్ ప్రభలు కోటప్పకొండ తిరునాళ్లకు మంగళవారం రాత్రి పయనమయ్యాయి. ప్రభుల వద్ద ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు. అనంతరం పోలేరమ్మ దేవాలయంలో పూజలు చేశారు. ప్రభల నిర్వాహకులు మాజీ కౌన్సిలర్ ఎం.ఆదయ్య, సుబ్బారావు, నాయకులు మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, పూజల వెంకట కోటయ్య, దరువూరి నాగేశ్వరరావు, కొణికినేని సత్యనారాయణ, జానీ, బి.శ్రీనివాసరావు, కె.వీర భాస్కర్ రెడ్డి, కార్మిక నాయకుడు కంబాల శ్రీనివాస్, వెంకట్రావు, హనుమంతరావు, అంకమ్మరావు, వీరాంజనేయులు, కోటేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.